క్లుప్తంగా

సైనిక్ స్కూల్‌లో విద్యార్థికి సీటు



కురవి: మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో ఐదో తరగతి చదువుకుంటున్న హలావత్ మణికంఠ సాయి శ్రేయస్‌కు సైనిక్ స్కూల్‌లో సీటు లభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అల్వాల కార్తీక్ మంగళవారం తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని రుక్మాపూర్‌లోని సైనిక్ స్కూల్‌లో సీటు వచ్చినట్లు ఆయన వివరించారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయ వార్షికోత్సవం

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఆలయంలో ఆలయ కమిటీ ప్రతినిధి నున్నా రమణ, భారతి దంపతుల ఆధ్వర్యంలో హోమంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

భూకబ్జా యత్నంపై ఫిర్యాదు

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె గ్రామ శివారు స్టేషన్‌తండా సమీపంలో గల ప్రభుత్వ భూమిలో గతంలో తీసిన పెద్ద గుంతను కొందరు వ్యక్తులు మట్టితో పూడ్చి కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అదే తండాకు చెందిన బానోతు శ్రీనివాస్‌నాయక్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. తండా సమీపంలో గల ప్రభుత్వ భూమిలో అవసరాల నిమిత్తం గతంలో జీపీ నుంచి మట్టిని తవ్వి తీసుకెళ్లారని, అప్పటి నుంచి ఆ గుంత అలాగే ఉండగా, ఇప్పుడు కొందరు వ్యక్తులు ట్రాక్టర్లలో మట్టిని తీసుకువచ్చి ఆ గుంతను పూడ్చుతూ, కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయొద్దు

మహబూబాబాద్ అర్బన్: ఏ సబ్జెక్ట్ ఉపాధ్యాయుడిని ఆ సబ్జెక్టుకే పరిమితం చేయాలని ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు దిడ్డి అనిల్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సైన్స్ కోసం నియమించిన ఉపాధ్యాయులను సైన్స్ బోధనకే పరిమితం చేయాలన్నారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిని గణితం బోధించమనడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు 6 నుంచి 10వ తరగతి వరకు సైన్స్‌ను రెండు విభాగాలుగా చేసి, భౌతిక, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం ఉపాధ్యాయులకు బోధన సులభంగా జరిగేట్టు చూడాలన్నారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయులను గణితం బోధించమని ఒత్తిడికి గురిచేయవద్దన్నారు.

సంత వేలం రూ.46వేలు

నర్సింహులపేట: పెద్దనాగారం స్టేజీ గ్రామ పంచాయతీ పరిధిలో స్టేజీ మీద ప్రతి గురువారం నిర్వహించే సంత వేలం రూ.46వేలు పాడినట్లు ఎంపీఓ సోమ్‌లాల్ తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి మంగళవారం వేలంలో పాల్గొని కైవసం చేసుకున్నాడు.

తండ్రికి తల కొరివిపెట్టిన కూతురు



మహబూబాబాద్ రూరల్: తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన ఐతరాజుల రామ్మూర్తి గుండెపోటుతో సోమవారం రాత్రి మృతిచెందాడు. ఆయనకు కుమారులు లేకపోవటంతో కుమార్తె రమ్య తలకొరివి పెట్టింది. ఈఘటనను చూసిన స్థానికులు బోరున విలపించారు.

ఎమ్మెల్యే పరామర్శ

కేసముద్రం: మండల కేంద్రానికి చెందిన మాజీ మండల్ కోఆప్షన్ మెంబర్ ఎస్కే.జానీ(70) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు మృతుడు కుటుంబాన్ని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ పరామర్శించి ఓదార్చారు. మృతదేహంపై పూలమాల వేసి సంతాపం తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే

కురవి: రెండు రోజుల క్రితం మండలంలోని నేరడలో బీఆర్ఎస్ నాయకుడు, కురవి సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డిపై జరిగిన దాడి విషయమై పోలీసులతో మాట్లాడేందుకు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మంగళవారం కురవి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై గోపిలతో చర్చించారు. హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని మాట్లాడారు. విచారణ చేసి కేసు నమోదు చేస్తామని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌కు పోలీసులు తెలిపారు. రెడ్యానాయక్ పోలీస్ స్టేషన్‌కు రావడం చర్చనీయాంశంగా మారింది.

పనులు పూర్తయ్యేనా?

- ప్రభుత్వ బడుల మరమ్మతుల కోసం ప్రొసీడింగ్ విడుదల చేసి 40రోజులు
- ఇప్పటి వరకు పూర్తి కాని పనులు
- జూన్ 12న తెరుచుకోనున్న పాఠశాలలు
- నెరవేరని ప్రభుత్వ ఆశయం



పంతులు తండాలో పనులు మొదలుపెట్టని ఆదర్శ పాఠశాల

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో ఉండేందుకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు తదితర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం హడావుడిగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు వేసి పాఠశాల మరమ్మతుల కోసం ఏప్రిల్ నెలలో ప్రొసీడింగ్ విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలల పాత కమిటీలను రద్దు చేసి పాఠశాలల్లో చదువుకునే పిల్లల తల్లులున్న మహిళా సంఘాల కమిటీల ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నెల దాటుతున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క పాఠశాల పనులు పూర్తి కాలేదు. కొన్ని పాఠశాలల్లో పనులు మొదలు పెట్టనేలేదు.

మండలంలో మొత్తం 31 పాఠశాల్లో అభివృద్ధి పనులు నిర్వహించి సౌకర్యాలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల పనులు మంజూరు చేశారు. 31 పాఠశాలల్లో ఐదు, పది పాఠశాలలు మినహా అన్నిపాఠశాలల్లో పనులు నత్తనడకన నడుస్తున్నాయి. 1, 2 పాఠశాలలు ఇప్పటికి పనులు అలంకారప్రాయంగా మాత్రమే మొదలు పెట్టారు.

ప్రారంభం నాటికి పూర్తయ్యేనా?

పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు సకల సౌకర్యాలను అందుబాటులోకి తేవాలనే ప్రభుత్వ లక్ష్యం, ప్రధానోపాధ్యాయులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల అలసత్వంతో నీరు గారేలా ఉంది. పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించి 40రోజులు గడుస్తున్నా అభివృద్ధి పనులు మాత్రం అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తి అయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మండలానికి రూ.1.11కోట్లు మంజూరు

మండలంలోని 31 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మైనర్ రిపేర్, మరుగుదొడ్ల మరమ్మతులు తదితర అభివృద్ధి పనుల నిర్వహణకు ప్రభుత్వం రూ. 1.11కోట్లు మంజూరు చేసింది. అందులో ప్రస్తుతం 25శాతం నిధులను అమ్మ ఆదర్శ పాఠశాల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.1.32 లక్షలు నుంచి రూ.13.2లక్షలు మంజూరు చేసింది.

సకాలంలో విత్తనాలు అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సక్రు

గార్ల: ఖరీఫ్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు రాయితీపై పంపిణీ చేయాలని కోరుతూ మంగళవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు మాట్లాడారు. రైతులకు ఒకేదఫా రూ.2 లక్షలు రుణమాఫీ చేసి, జూన్ నెలలో రైతులకు కొత్త పంటరుణాలు అందజేయాలని, 50శాతం రాయితీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కె.రవీందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఎం.వీరభద్రం, సక్రు, ఎం మాన్యా, రైతులు మంగయ్య, ప్రసాద్, రాజ్‌కుమార్, మత్రు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో పేదలపై భారం



మాట్లాడుతున్న రాజన్న

కేసముద్రం: కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలను పెంచి, పేదలపై మరింత భారాన్ని మోపిందని సీపీఎం జిల్లా నాయకుడు గునిగంటి రాజన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్రోల్, డీజిల్, జీఎస్టీ పేరుతో నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి, ధనికులకు, పెట్టుబడిదారులకు, కార్పొరేటర్లకు చౌకగా ఉండే విధంగా నిబంధనలు చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో ఓటమి భయంతో ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు, మార్తినేని పాపారావు, చాగంటి కిషన్, సావిత్ర, వెంకన్న, నర్సయ్య, గొడిశాల వెంకన్న, జల్లె జయరాజ్ పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో అనేక లాభాలు



సదస్సులో మాట్లాడుతున్న సందీప్

దంతాలపల్లి: వరి పొలాల్లో వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే అనేక లాభాలు ఉన్నాయని వ్యవసాయ విస్తరణ అధికారి సందీప్, అంతర్జాతీయ వరి పరిశోధకుడు చైతన్య సాయి అన్నారు. మండలంలోని పెద్ద ముప్పారం గ్రామంలో రైతువేదికలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. రైతులు ఎకరం పొలం నాటు వేయాలంటే ఖర్చు బాగా అవుతుందన్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతారన్నారు. వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తే ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ పద్ధతిలో రైతులు ఎకరాకు 10 కిలోల నుంచి 12కిలోల ధాన్యం నానబెట్టి మొలకలు కాక ముందు పొలాల్లో చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కొండ మధు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న క్రమంలో పట్టణంలోని మాస్టర్ మైండ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం మండల రిసోర్స్ సెంటర్‌లో అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం నరేశ్ మాట్లాడారు. మాంటిసోరి పాఠశాల పేరుతో అనుమతి తీసుకుని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మాస్టర్ మైండ్ స్కూల్ పేరుతో వివిధ గ్రామాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల తీరుపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దు, నాయకులు ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రమోద్ పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

నర్సంపేట: జనాభా మేరకు బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురుమిళ్ల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమ్మరికుంటలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, ఇతర రంగాల్లో వాటా, సంక్షేమ పథకాల అమలు కోసం ఆయా కులాల ఆర్థిక, సామాజిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని శాస్త్రీయంగా లెక్కించాల్సి ఉందన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారమే రిజర్వేషన్ అమలవుతుండగా బీసీలకు అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో 12 వేల 769 గ్రామాలు ఉన్నాయని, స్థానిక స్వపరిపాలనలో అన్ని కులాల ప్రాతినిధ్యం ఉండాలంటే కులాల వారిగా జనాభా లెక్కించి ఆ మేరకు వాటా నిర్ణయించాలని ఆకాంక్షించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ గతంలో హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కులగణన ఆలస్యమయ్యే అవకాశం ఉన్న క్రమంలో గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 52 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గన్నారపు సరోజన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి, గోవిందు, మొగిలి పాల్గొన్నారు.

వానాకాలం పంటలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

నెల్లికుదురు: వచ్చే వానాకాలంలో సాగు చేసే పంటలు, విత్తన కొనుగోళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం ఇనుగుర్తి మండలంలోని చిన్న నాగారం, చిన్నముప్పారం నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు, ఆలేరు, ఎర్రబెల్లిగూడెం గ్రామ రక్లస్టర్ గ్రామాల్లో ఆయా గ్రామాల ఏఈఓల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ అనుమతి పొందిన ఎరువు షాపుల్లో మాత్రమే ఎరువు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రశీదు తీసుకుని భద్రపర్చుకోవాలన్నారు. కాగా రైతులకు పంటలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతువేదికల వద్దకు రైతులు రాక పోవడంతో ఏఈఓలు ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు ముజాహిద్, సుమన్, కల్యాణి, శిరీష, చందన పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



రాంపురం స్కూల్‌ను సందర్శిస్తున్న అధికారి సుధాకర్

మరిపెడ రూరల్: పాఠశాలల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి కొత్త విద్యాసంవత్సరానికి పిల్లలను అందించాలని మరిపెడ మండల ప్రత్యేక అధికారి, జిల్లా వెటర్నరీ అధికారి డాక్టర్ సుధాకర్ ప్రధానోపాధ్యాయులు, ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా మండలంలోని నీలికుర్తి, రాంపురం, బావోజిగూడెం, నేతవత్ పర్కుజల తండాల్లో పాఠశాలలను స్థానిక ఎంపీడీఓ రేవతితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 25శాతం అభివృద్ధి పనుల నిధులను విడుదల చేశారని తెలిపారు. కొత్త విద్యా సంవత్సరం 2024–25 బడులు తెరుచుకునే లోగా పనులు పూర్తి చేసి తీరాలన్నారు. స్కూల్ ప్రారంభం నాటికి పిల్లలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమం ఆర్అండ్‌బీ ఏఈ శివకుమార్, రాంపురం, చిల్లంచర్ల కార్యదర్శి ఉమేష్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవ పూజలు



కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న పూజారులు

ఖానాపురం: మండలంలోని బుధరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ పూజలు మంగళవారం ఘనంగా కొనసాగాయి. రెండ్రోజులపాటు ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు తలపెట్టగా భక్తులు హాజరై పూజ చేశారు. మండపారాధన, పూర్ణాహుతి పూజలతోపాటు వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకను భక్తిశ్రద్ధలతో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, చెడిపాక ఉపేందర్, రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు పద్మ, జెడ్పీటీసీ బత్తిని స్వప్న శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ బిక్కి లింగమ్మ మురళీ, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో ల్యాదినేని ఎల్లయ్య, ఎలంశెట్టి ప్రసాద్, మోడెం ఎల్లగౌడ్, పసునూరి వెంకటేశ్వర్లు, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఊర చెరువు శిఖం భూములను కాపాడాలి



మాట్లాడుతున్న వెంకన్న

చెన్నారావుపేట: మండలంలోని పాపయ్యపేట ఊర చెరువు శిఖం భూములు అక్రమణ బారి నుంచి కాపాడాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకుడు, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమణకు గురవుతున్న ఊర చెరువు శిఖం భూమిని ఆయన ఆధ్వర్యంలోని బృందం మంగళవారం సందర్శించింది. అనంతరం నాయకులు, రైతులతో కలిసి వెంకన్న మాట్లాడారు. చెరువు శిఖం భూమి సుమారు 121 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా నానాటికీ కబ్జాకు గురవుతుందని చెప్పారు. అయినా రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి చెరువు శిఖం భూమికి హద్దులు ఏర్పాటు చేయడంతోపాటు ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బండి రమేశ్, కాంగ్రెస్ నాయకులు అబ్బదాసి సుధాకర్, అలువాల యాకయ్య, అలువాల అశోక్, కన్నం సారయ్య, అలువాల సుధాకర్, బొక్కల రజిని, బొక్కల పూలమ్మ, అలువాల పూలమ్మ, తిక్క వీరమ్మ, అలువాల సుధ, కన్నం మరియమ్మ, కన్నం శోభ, కన్నం శ్రీలత, కన్నం సందీప్, బత్తిని సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



మహబూబాబాద్: ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గార్లలో..



బయ్యారంలో..

మహబూబాబాద్: తెలుగు జాతి ఔనత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని టీడీపీ మానుకోట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్‌రావు కొనియాడారు. మానుకోట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101 జయంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్, రాంచంద్రమ్మ, నవీన్, బాలు, వెంకటేష్, సాగర్, యాకన్న, కోటి, హచ్చానాయక్ పాల్గొన్నారు.

పెద్దవంగర: ఎన్టీఆర్ జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాషం యాకయ్య, ఐలయ్య, బుచ్చిరాములు, వీరన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డు సెంటర్‌లో ఎన్టీఆర్ అభిమాని బిక్కసాని రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, నాయకులు వేణు, హనుమంతరావు, జనార్దన్ పాల్గొన్నారు.

బయ్యారం: కమ్మ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గంధంపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గణేష్, నాయకులు శరత్, రాము, రాజేష్ తదితరులతోపాటు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

గార్ల: గార్ల పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఎన్టీ రామారావు విగ్రహానికి నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీహెచ్‌సీ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు సత్యం, జితేందర్ అగర్వాల్, మేడేపల్లి దశరథ్, పిడమర్తి రమేష్, యకూబ్ అలి పాల్గొన్నారు.

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ సర్పంచ్ సట్ల నర్సయ్యతోపాటు, పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలెపల్లి చెన్నారెడ్డి, మాచర్ల ప్రసాద్, కుమార్, కీర్తి సంపత్, కేదారి, సత్యనారాయణ, దేవేందర్ పాల్గొన్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు



రైతు సాగు చేసిన గోరు చిక్కుడు



బెండ తోట

మహబూబాబాద్ రూరల్: వేసవి కాలంలో ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తూ కూరగాయల సాగు రైతుల పాలిటవరంగా మారుతుంది. కూరగాయల సాగు కంటే ముందు మిర్చి పంటను సాగు చేయగా దానికి తెగుళ్లు, గుబ్బ రోగంసోకి ఎకరం మిర్చి సాగు చేస్తే కేవలం క్వింటన్నర (రూ.30 వేలు) మాత్రమే దిగుబడి వచ్చింది. దీంతో ఓ రైతు పంట మార్పిడి విధానం ద్వారా ఓ ఆలోచనకు వచ్చి కూరగాయల సాగు చేద్దామని నిర్ణయించుకున్నాడు.

మండలంలోని సాదుతండా జీపీ పరిధిలోని కంబాలబండ తండాకు చెందిన రైతు భూక్య వీరన్న తనకు ఉన్న వ్యవసాయ భూమిలో నుంచి ఇరవై గుంటల స్థలంలో గోరు చిక్కుడుకాయల పంటను సాగు చేశాడు. శ్రీరామనవమి సమయంలో మండుటెండల్లో కూడా ఎండను లెక్కచేయకుండా కూరగాయల సాగు మొదలుపెట్టి సుమారు రెండు నెలల వ్యవధిలో ఒకసారి ఆరు క్వింటాళ్లు, రెండోసారి ఎనిమిది క్వింటాళ్లు, మూడోసారి ఆరు క్వింటాళ్ల గోరు చిక్కుడుగాయలను కోశాడు. మొదటిసారి ఏడు రూపాయలు, రెండోసారి పది రూపాయలు, మూడోసారి ఇరవై రూపాయల చొప్పున విక్రయించాడు. అదేవిధంగా మూడు గుంటల స్థలంలో బెండకాయ పంటను సాగుచేయగా ఇప్పటివరకు పదిసార్లు రెండు క్వింటాళ్ల చొప్పున బెండకాయలుకోసి విక్రయించారు. ఈ విధంగా రైతు భూక్య వీరన్న వేసవిలో చేస్తున్న కూరగాయల సాగు ఆలోచన ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తుంది.

కూరగాయల సాగు బాగుంది



మిర్చి పంట సాగు చేస్తే నష్టం రావటంతో కూరగాయల సాగు మొదలుపెట్టాను. గోరు చిక్కుడు కాయలు, బెండకాయలు వేయగా మంచి లాభాలు వస్తుండగా పెట్టుబడి పోను కొంత సొమ్ము మిగులుతుంది. మొదట్లో మంచి ధరలు రాకపోయినా దశలవారీగా రేట్లు బాగానే వస్తున్నాయి. ఇలానే పంట దిగుబడి ఉండటం, మంచి ధర పలికితే కూరగాయల సాగు మరింత పెంచుతాం.

– భూక్య వీరన్న, రైతు, కంబాలబండ తండా

బాధిత కుటుంబానికి పరామర్శ



కురవి: మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు సంగెం నాగరాజు తల్లి సంగెం లక్ష్మీవీరమ్మ(76) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఈమేరకు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ విషయం తెలుసుకుని కురవికి వచ్చి జర్నలిస్టు తల్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, జిల్లా మాజీ కార్యదర్శి ఆవుల యుగేందర్, అక్రమ్ పూలమాల వేసి నివాళులర్పించి, పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, బజ్జూరి పిచ్చిరెడ్డి, బాదావత్ రాజునాయక్, రవినాయక్, నర్సింహరావు, కొణతం విజయ్, వెంకన్న పాల్గొన్నారు.